## క్లుప్తంగా

### మాజీ సర్పంచ్ మృతి


రాజేశ్వర్‌రావు (ఫైల్)

ఎల్కతుర్తి : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ పోలినేని రాజేశ్వర్ రావు(55) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు గోపాల్‌పూర్‌కు చేరుకుని రాజేశ్వర్ రావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఉమ్మడి రాష్ట్ర స్థాయి క్రీడాకారుడు కావడంతో పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

### చికిత్స పొందుతున్న కళాకారుడు..


పోచయ్య (ఫైల్)

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన కళాకారుడు మాడుగుల భానుప్రసాద్ ఆలియస్ పోచయ్య (39) ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. పోచయ్య ఈనెల 13న హుస్నాబాద్‌కు వెళ్లి వస్తున్న క్రమంలో గట్లనర్సింగాపూర్ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆయన్ను ఆస్పత్రిలో చేర్పగా మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పోచయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్ సంతాపం వ్యక్తం చేశారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

### మాజీ ఎంపీటీసీ సాయం



ధర్మసాగర్ : మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయిన నష్టపోయిన మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన మునిగాల వెంకటయ్య, కొత్తపల్లి ఎల్లయ్య, విజ్జ సరోజ, కొలిపాక సురేష్, బూట్ల సురేష్‌లకు మాజీ ఎంపీటీసీ తోట నాగరాజు గురువారం తోడ్పాటు అందించారు. ఒక్కో కుటుంబానికి 10 కేజీల చొప్పున బియ్యం, నగదు సాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాలను నాగరాజు పరామర్శించారు. ఇళ్లు కూలిన విషయాన్ని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. కడియం సానుకూలంగా స్పందించారని, కొత్త ఇండ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.

### వరద బాధితులకు సహాయక చర్యలు



పరకాల: వరదలతో ఇండ్ల నుంచి బయటకు రాలేని వరద బాధితులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ సహకారంతో 4వ వార్డు కౌన్సిలర్ రమ్యకృష్ణ నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. అదే విధంగా 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి తన వార్డులోని శ్రీనివాసకాలనీ, మమత నగర్ వాసులు వరద ముంపులో ఉండటంతో వారికి ఆహారపు పొట్లాలు పంపిణీ చేశారు.

### బాధిత కుటుంబానికి బాల్యమిత్రుల చేయూత



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామానికి చెందని రాజారపు రాజ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి బాల్యమిత్రులు చేయూత అందించారు. తొలుత రాజ్‌కుమార్‌తో కలిసి 7, 8 తరగతులు చదువుకున్న మిత్రులు అతడి కుటుంబాన్ని పరామర్శించారు. రాజ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడికి ఇద్దరు కొడుకులుండగా పోస్టాఫీసులో వారి పేరిట రూ.25 వేలు డిపాజిట్ చేసి పాస్ బుక్‌లు అందజేశారు. చేయూత అందించిన వారిలో చింతలపూరి హరికృష్ణారెడ్డి, కుంట అశోక్‌కుమార్, గబ్బెట ప్రేమ్‌దాస్ ఉన్నారు.

### వరంగల్ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 28 నుంచి 30 వరకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి మేరకు శుక్రవారం, 29న మొహర్రం, 30న ఆదివారం కావడంతో వరుసగా సెలవులు వచ్చాయని పేర్కొన్నారు.

# అస్తవ్యస్తం

అప్పపీడన ప్రభావంతో భారీగా కురుస్తున్న వర్షాలకు కమలాపూర్, పరకాల, ఎల్కతుర్తి, వేలేరు, ఆత్మకూరు, ఐనవోలు, దామెర, ధర్మసాగర్, నడికూడ, భీమదేవరపల్లి మండలాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. జనం ఇళ్లల్లోంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. విద్యుత్, ఇతరత్రా కోసమూ ఇబ్బందులు తప్పలేదు. –సాక్షి నెట్‌వర్క్

ఆత్మకూరు: కటాక్షపూర్ చెరువు వద్ద మత్తడి ఉధృతి



నడికూడ: మహ్మద్ షా నాలా మాటు వాగు




ధర్మసాగర్: నారాయణగిరిలో చేపలు పడుతున్న స్థానికులు

కమలాపూర్: ఉప్పల్‌లో నీట మునిగిన సబ్‌స్టేషన్




కమలాపూర్: పోలీస్‌స్టేషన్‌లోకి చేరిన వరద నీటిని ఎత్తి పోస్తున్న కానిస్టేబుల్


ధర్మసాగర్: ఎల్కుర్తి గ్రామంలోని ఇళ్లల్లోకి చేరుకున్న వర్షపు నీరు


కమలాపూర్: శంభునిపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోకి చేరిన వరద నీరు


దామెర : ఇల్లు కూలిన బాధితుని కుటుంబాన్ని పునావాస కేంద్రానికి తరలిస్తున్న ఎంపీపీ శంకర్


ధర్మసాగర్ : జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు


ఎల్కతుర్తి: పీహెచ్‌సీ ప్రాంగణంలో నిలిచిన వరద నీరు


శాయంపేట: మైలారంలోని పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారులు


దామెర : జాతీయ రహదారిపై నిలిచిన నీటిని మళ్లిస్తున్న అధికారులు


నడికూడ: చౌటుపర్తి నల్లకుంట చెరువుకు గండిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేందర్


ఎల్కతుర్తి: వర్షానికి కూలిన ఇళ్లు


నడికూడ: నార్లపూర్ గ్రామంలో వరద ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్


ఆత్మకూరు: కటాక్షపూర్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్


కమలాపూర్: పోలీస్ క్వార్టర్స్‌లోకి చేరిన వరద నీరు


ఆత్మకూరు: గుడెప్పాడ్ సమీపంలో పడిపోయిన హోర్డింగ్

## ఇద్దరిని కాపాడిన పోలీసులు

పరకాల : మండలంలోని నాగారం గ్రామ శివారులోని లోలెవల్ వంతెన వద్ద కారు కొట్టుకుపోగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరిని పోలీసులు కాపాడారు. వివరాలిలా.. గూడెప్పాడ్ గ్రామానికి చెందిన వంగర శ్రీరామ్ అతడి మిత్రుడు అరుణ్‌తో కలిసి పోతుగల్లు గ్రామానికి కారులో వెళ్తుండగా నాగారం లోలెవల్ వంతెన వద్ద వరద ఉధృతికి వారు ప్రయాణిస్తున్న కారు కొట్టుకపోయి వాగు మధ్యలో చెట్టును ఆసరా చేసుకుని నిలిచింది. స్థానికులు సమాచారం అందించడంతో ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ వెంకటరత్నం పోలీసు సిబ్బంది, ఫైర్ సిబ్బందితోపాటు గత ఈతగాళ్ల సహాయంతో ఇద్దరినీ కాపాడి బయటకు తీసుకొచ్చారు. ఏసీపీ కిషోర్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, కుంటలు, వాగులను దాటడానికి యత్నించొద్దని కోరారు.


రక్షించబడ్డ యువకులతో పోలీసులు

## సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అల్లాడుతున్న జనాన్ని ఆదుకునేలా సహాయక చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. మండలంలోని మైలారం గ్రామంలోని పెద్దచెరువు వరద నీరు సమీప దళితకాలనీలోని ఇళ్లలోకి చేరగా బాధిత కుటుంబాలను ఆయన గురువారం పరామర్శించారు. తొలుత దళితకాలనీలో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సత్యనారాయణరావు మీడియాతో మాట్లాడారు. వర్షాలకు దళితకాలనీలోని సుమారు 100 ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో పంట, బియ్యం, నిత్యావసర సరుకులు దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రభుత్వం బాధితులను ఆదుకునేలా కనీసం పునరావాస కేంద్రాలను సైతం ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. మోరంచపల్లి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకోగా ముగ్గురు గల్లంతయ్యారని చెప్పారు. సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాలకు నియోజకవర్గంలోని సుమారు 300 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. మైలారంలో 15 ఇండ్లు కూలిపోయాయని, బాధిత కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయడంతోపాటు తక్షణ సాయంగా రూ.10 వేలు చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, మారెపల్లి రాజు తదితరులున్నారు.


దళితకాలనీని పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

## రైతుల సమగ్రాభివృద్ధే ధ్యేయం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

ఆత్మకూరు : రైతుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అక్కంపేటలోని ఎరువుల దుకాణంలో రైతులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో ఎరువులు అందించేలా కిసాన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. కిసాన్ సేవా కేంద్రాల ఏర్పాటును ప్రధాని మోదీ రాజస్థాన్‌లో ప్రారంభించారని తెలిపారు. కిసాన్ సేవా కేంద్రం ద్వారా భూసార పరీక్షలు సైతం నిర్వహిస్తారని వివరించారు. మండలంలోని రైతులందరూ కిసాన్ సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

## తహసీల్దార్లకు పదోన్నతులు

హన్మకొండ అర్బన్ : రాష్ట్రంలో 81 మంది తహసీల్దార్లకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా (ఎస్‌డీసీ) పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో హనుమకొండ జిల్లా నుంచి ప్రస్తుతం కలెక్టరేట్ ఏఓగా పనిచేస్తున్న కిరణ్‌ప్రకాష్, పరకాల ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఉమారాణి, వరంగల్ జిల్లా నుంచి శ్రీరాములు, డీఎస్ వెంకన్న ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చోరీ

కరీమాబాద్: కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోని గదుల తాళాలు పగులగొట్టి 10 ఫ్యాన్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. కార్పొరేటర్ మరుపల్ల రవి హెచ్‌ఎం శ్రీకాంత్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చోరీ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అన్నదానం

హన్మకొండ చౌరస్తా: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇబ్బంది పడుతున్న పేదలకు అన్నదానం చేశారు. 7వ డివిజన్ పరిధిలోని కంచరకుంట, సాయినగర్ కాలనీ, జితేందర్‌నగర్, అంబేడ్కర్‌నగర్ కాలనీల్లోని బాధితులకు పద్మాక్షికాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మంద రాకేష్ గురువారం భోజన ఏర్పాట్లు చేశారు.

## కేయూలో సమర రిలే దీక్షలు షురూ

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలని కాకతీయ యూనివర్సిటీలోని మహిళా కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. క్యాంపస్‌లోని పరిపాలన భవనం ఎదుట సమర రిలే నిరాహార దీక్షలను గురువారం చేపట్టారు. దీక్షను కేయూ ఫార్మసీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ సారంగపాణి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అనేక సంవత్సరాల నుంచి కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలనే డిమాండ్ న్యాయమైనదని అన్నారు. దీక్ష శిబిరంలో పాల్గొన్న కాంట్రాక్టు అధ్యాపకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో 15నుంచి 20ఏళ్లుగా కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్న వారందరిని క్రమబద్ధీకరించాలని కోరారు. దీక్ష చేపట్టిన వారికి కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షలో రాజేశ్వరి, సునీత, మంజుల, రాధిక, రమాదేవి, శ్రీలక్ష్మి, వందనశ్రీ, చిర్ర రాజు, భిక్షపతి, అరూరి సూర్యం, గజ్జల మల్లేష్, రవీందర్, నాగేశ్వర్‌రావు, సత్య జూల, కొమురయ్య, మంతని శంకర్, సాంబశివరావు, సాయిశరణ్, వెంకటగోపినాథ్ పాల్గొన్నారు. కాగా, దీక్షలకు జేఎన్టీయూ యూనివర్సిటీ నుంచి వెంకటేష్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య సంఘీభావం తెలిపారు.

## అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర

హన్మకొండ: అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కల్లుగీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక చైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 2న బొల్లగాని పుల్లయ్య 35వ వర్ధంతి నుంచి 18న సర్వాయి పాపన్న 373వ జయంతి రోజు వరకు రాష్ట్రవ్యాప్తంగా సామాజిక చైతన్య యాత్ర నిర్వహిస్తామన్నారు. అమరవీరుల త్యాగాలను నేటి సమాజానికి తెలుపుతూ, కల్లుగీత వృత్తిలో ఉపాధి – ప్రత్యామ్నాయ మార్గాలను ప్రచారం చేస్తూ వేలాది మందికి సామాజిక చైతన్యం కల్పిస్తామని చెప్పారు. కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన బొమ్మగాని దర్శ భిక్షం, ఎస్.ఆర్ దాట్ల, తొట్ల మల్సూర్, దేశిని చిన్న మల్లయ్య, పెరుమాండ్ల జగన్నాదం, బొల్లగాని పుల్లయ్య, వర్దెళ్లి బుచ్చి రాములు, బైరు మల్లయ్యను స్మరించుకుంటూ ఈ యాత్ర సాగుతుందన్నారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు వెంకట నర్సయ్య, తాళ్లపల్లి రామస్వామి, సురుగు రాజేష్, శివ శంకర్, బుర్ర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అవిశ్రాంత శ్రమతో విద్యుత్ పునరుద్ధరణ


ముస్త్యాలపల్లిలో స్తంభాలపై చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది


33 కేవీ లైన్‌ను సరి చేస్తున్న సిబ్బంది

దామెర : భారీ వర్షానికి ఏర్పడిన విద్యుత్ అంతరాయానికి ఆ శాఖ సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమించి కట్టడి చేశారు. ఎట్టకేలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వివరాలిలా.. మండలంలోని దామెర, ఇతర గ్రామాల్లో వర్షాలకు గురువారం తెల్లవారుజామున విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఇళ్లల్లో ప్రజలు ఫ్యాన్లు తిరగక, బోర్లు పని చేయక నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, సాయంత్రం గడుస్తున్నా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు నానాయాతన పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసి ఆ శాఖ ఏఈ గుర్రం రమేష్ సిబ్బందితో కలిసి మోకాళ్లలోతు నీటి ప్రవాహం ఉన్నప్పటికీ రోజంతా తిరుగుతూ సమస్యను గుర్తించే ప్రయత్నం చేశారు. ముస్త్యాలపల్లిలోని విద్యుత్ స్తంభాలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. సుమారు 9 గంటలపాటు అవిశ్రాంతంగా శ్రమించిన ఏఈ రమేష్, సిబ్బంది ఎట్టకేలకు సమస్య 33 కేవీ దామెర, ఊరుగొండ సబ్‌స్టేషన్‌లో ఉన్నట్టు గుర్తించి మరమ్మతులు చేపట్టారు. 33 కేవీ లైన్‌ను సరి చేసి రాత్రి 9 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వర్షంలోనూ అవిశ్రాంతంగా విధులు పనులు చేసిన ఏఈని, సిబ్బందిని పలువురు అభినందించారు.